కథ


# వైరస్

యద్దనపూడి సావిత్రి

''అయితే లీవ్ పెట్టనంటావా శైలూ!'' మరోసారి అడిగాడు శేఖర్.

''ఊహు. నాకు వీలుకాదు. అయినా ఈ నెల్లో అప్పుడే రెండ్రోజులు లీవు పెట్టాను. పాపను క్రష్‌లో వాళ్ళు బానే చూస్తారు. అక్కడ దించితేసరి'' అని తేల్చేసి స్నానానికి వెళ్ళింది శైలజ.

శేఖర్‌కి ఆమెనెలా కన్విన్స్ చేయాలో అర్థం కాలేదు. ఈమధ్య ప్రతి విషయంలోనూ అలాగే జవాబులు చెబుతోంది. తన మాట నెగ్గాలన్న పట్టుదల



తప్ప మరే విధంగానూ ఆలోచించడం లేదు శైలజ.

"పాలు కాచి ఫ్లాస్క్‌లో పోసాను పాపకి. నేవెళుతున్నా!" అంటూ వెళుతున్న శైలజను చూసి నిట్టూర్చి స్నానానికి వెళ్ళాడు.

శైలజ నడుస్తూ ఆలోచించసాగింది. అసలు తనే ఎందుకు లీవుపెట్టాలి? తనూ ఉద్యోగం చేస్తోంది. తనతోపాటుగా ఉన్న అక్కౌంట్ అసిస్టెంట్లు తన్నే ఆరాధనా భావంతో, గౌరవంతో చూస్తారు. తను చాలా తెలివైనదనీ, సిన్సియర్ అనీ, ఇలాంటి ఆడవాళ్లు చాలా తక్కువనీ అనుకోవడం తనకి తెలుసు. కానీ యింట్లో..శేఖర్ ఎందుకు అలా ఆలోచించడు? పిల్లలూ, భర్తా జీవితంలో ఒక భాగం మాత్రమే. అంతేగానీ జీవితమే వాళ్ళు కాదు. స్త్రీ కేవలం పిల్లల్ని కనే యంత్రం కాదు. ఇలా ఆలోచిస్తూ రెండు ఫర్లాంగులు నడిచి ఆఫీసువున్న ఆవరణలో అడుగుపెట్టి వాచీ చూసుకుంది. పదిన్నర..అరగంట లేటు..

గబగబా లిఫ్ట్ వైపు నడిచింది. లిఫ్ట్‌పైకి వెళ్ళినట్టుంది. ఇంకో పది నిమిషాలన్నా పడుతుంది ఆరో అంతస్థు వరకూ వెళ్ళి వచ్చేందుకు. ఇంకె వరన్నా కాస్త ఆగమంటే ఇంకొంచెం ఆలస్యం. అయినా పైన నాల్గో అంతస్తు కొరియర్ వాళ్ళ మూలంగా ఎప్పుడూ ఆలస్యం అవుతుంది కూడా. తమ ఆఫీసు మూడో అంతస్తేగా..ఆలోచిస్తూనే మెట్లెక్కుతున్న శైలజకు పరిచిత స్వరాలు వినిపించాయి సెకండ్ ఫ్లోర్‌లో.

"నీ ఆరాధ్యదేవత యింకా రాలేదేం?" నాగేంద్ర అంటున్నాడు.

"నాకేం. నీకూ ఆరాధ్య దేవతేగా!" భూషణ్ సమాధానం.

శైలజ కుతూహలంతో ఆగింది ఎవరో ఆ ఆరాధ్యదేవత విందామని. వాళ్ళూ వాళ్ళతోబాటు శ్రీధర్ ప్లేస్‌మెంట్ సర్వీస్ ముందు నిలబడి అవతలి వైపు బాల్కనీ వైపు చూస్తున్నారు. వెనగ్గా మెట్లపై వస్తున్న శైలజని చూడలేదు వాళ్ళు.

"దాని బొంద..దాన్నెవడు ఆరాధిస్తాడు? మొగుణ్ణీ, పిల్లనీ పట్టించుకోకుండా ఎప్పుడూ- అయితే ఆఫీసూ లేకపోతే షాపింగ్‌లూ, మీటింగ్‌లూ''. నవ్వాడు నాగేంద్ర.

భూషణం మాటలకి నాగేంద్ర అంత నవ్వాల్సిందేం వుంది. అయినా భూషణం ఎవర్ని గూర్చి అంటున్నాడు? మళ్ళీ నాగేంద్ర గొంతు వినిపించింది.

"పాపం ఆ మొగుడుగార్ని అభినందించాలి ఏకపత్నీవ్రతుడైనందుకు. ఇట్లాటి ఆడదాన్ని ఎవడు భరిస్తాడు? పోయిన నెల్లో ఆయనకి అపెండిసైటిస్ ఆపరేషనయిందా! ఒక్కరోజు లీవ్ పెట్టేసరికి మహాబాధపడిపోయింది. ఏమాత్రం ప్రేమాభిమానాలు లేని భార్యని పట్టుకుని సంసారం ఈదుతున్నాడని అతన్ని అభినందించాలి మనం."

శైలజ మొహం మాడిపోయింది. పోయిన నెల్లో శేఖర్‌కి అపెండిసైటిస్ ఆపరేషన్ అయింది.

"ఆ పిల్లనూ అంతేనట. ప్రక్క అపార్ట్‌మెంట్‌లో నేగా మా బావమరిదీవాళ్ళూ వుండేది. అప్పుడప్పుడూ చెబుతూంటాడు." భూషణ్ అన్నాడు.

శైలజ కాళ్ళు మూడో అంతస్తు ఎక్కేందుకు సహకరించమని మొండికేసాయి. మెల్లిగా వెనుదిరిగింది.

"మరి ఆరాధ్యదేవత అంటారేం?" శ్రీధర్ ప్రశ్న.

"అదోజోకు..మా కోడ్ లాంగ్వేజ్.." అందరి నవ్వులూ రెండో అంతస్తు దిగి వస్తున్న శైలజ వీపు నుండి గుండెల్లోకి దూసుకొచ్చాయి. గబగబా ఆఫీసు ప్రాంగణంలోంచి బయటికి వచ్చి పబ్లిక్ బూత్ ముందు ఆగింది. హెడ్‌క్లర్క్‌కి ఫోన్ చేసి ఈరోజు రాలేనని చెప్పింది.

ఏం చెయ్యాలి. వాళ్ళ మాటలు చెవుల్లో రింగుమంటున్నాయి. ఇంటికెళ్ళినా ఏం చేస్తుంది. పాపని క్రష్‌లో దించి శేఖర్ బాంక్‌కి వెళ్ళివుంటాడు. అయినా తాను వాళ్ళ మాటలకు బాధపడాలా? వాళ్ళ మాటలకు కాదు. వాళ్ళు యిన్నాళ్ళూ తన పట్ల వ్యక్తపరచిన అభిమానం, గౌరవం అంతా ట్రాష్ అని అర్థం అయినందుకు బాధగా వుంది.

పావని దగ్గరికెళితే సరి?

పావని ఆ టైమ్‌లో శైలజని చూసి ఆశ్చర్యపోయింది. "ఏంటీ యివాళ ఆఫీసు లేదా?" అని సమాధానం రాక శైలజ మొహం చూసి -"వంటింట్లోకెళదాం రా! ఇంకా వంట కాలేదు. కాఫీ తాగి వంట చేస్తూ

కబుర్లు చెప్పుకుందాం" అంటూ వంటింట్లోకి దారి తీసింది పావని.

"ఏవిటీ విశేషాలు? పాప ఎలా వుంది? దానికి విరోచనాలు తగ్గాయా?" కాఫీ గ్లాసు అందిస్తూ అడిగింది పావని.

"కాస్త తగ్గాయి. నీకెలా తెలుసు దానికి విరోచనాలని?"

పావని కూడా ఈ ఆర్నెల్లలో తమ యింటికి రాలేదు. తనూ ఫోన్ చెయ్యలేదు. "అదా! పోయిన వారం మావారు సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూంటే శేఖర్ పాపని తీసుకుని వెళుతూ కనిపించాడట. పాపకి తరచు విరోచనాలు అవుతున్నాయి. అందుకే డాక్టర్ దగ్గరికి తీసుకెళుతున్నానని చెప్పాట్ట. ఇంతకీ యిప్పుడు బావుందా?"

పావని ప్రశ్నకు శైలజ వెంటనే సమాధానం చెప్పలేదు. అంటే పోయిన శుక్రవారం శేఖర్ క్రష్‌నుంచి పాపని తీసుకుని డాక్టర్ దగ్గరికెళ్ళి యింటికి లేటుగా వచ్చాడా? తనేం చేసింది. ఇంకా వాళ్ళిద్దరూ రాలేదని విజయగారి సన్మానసభకు వెళుతూ తాళం చెవులు ప్రక్క అపార్ట్‌మెంట్ వాళ్ళకి యిచ్చింది. రాత్రి తను వచ్చేసరికి తొమ్మిదయింది. "అన్నం వక్కటి వండు శైలూ..పచ్చడీ..మజ్జిగ చాలు..ఏదో తినేద్దాం" అన్నాడు శేఖర్. తనెంత రాద్ధాంతం చేసింది? 'ఏం ఒకపూట వంట చేసుకోలేరా?" అంటూ.

"శైలూ! ఏమైనా గొడవ పడ్డావా శేఖర్‌తో. పోనీ ఆఫీస్‌లో ఏదైనా గొడవా?" అడిగింది పావని.

"ఏం లేదు పావనీ!" అంది శైలజ

"ఏం లేదంటావేం? నిన్ను చూస్తే తెలుస్తోంది. ఏదో జరిగింది. లేకపోతే నీవు ఆఫీసు వదిలి యిలా వస్తావా? ఏం జరిగిందో చెప్పవే" అంటూన్న పావన్ని చూసి యిక తన్ను తాను కంట్రోల్ చేసుకోలేక చెప్పేసింది శైలజ. అంతా విన్న పావని ఓ అయిదు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. తరువాత మెల్లిగా చిన్నపిల్లకి నచ్చచెప్పినట్టు "శైలూ నీవింకా స్టూడెంట్‌వి కాదు. ఎవరైనా అప్రిషియేట్ చెయ్యగానే పొంగిపోయేందుకు. వివాహితవు. నీ భర్తపట్ల, నీ బిడ్డలపట్లా నీకు బాధ్యత వుంది. అది నీవుమరచిపోకూడదు కదా! అది మరచిపోయి కేవలం నీవల్లే ఆఫీసు నడుస్తుందీ అనుకుని నీ గృహబాధ్యతల్ని విస్మరిస్తే ఎలా?" అంది.

శైలజ కన్నీళ్ళు తుడుచుకుంటూ ఉక్రోషంగా "ఉద్యోగినిగా నాకో గుర్తింపురావాలనీ నా వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలనీ అనుకోవడం తప్పా?" అంది.

"తప్పుకాదు. కానీ నీ వ్యక్తిత్వం గుర్తింపునీవు కొలీగ్స్ నుండి పొందే అభినందనల వల్ల రాదు. పోయినసారి మనం కల్సినప్పుడు నీవు అన్నావు గుర్తుందా? పని లేనపుడు ఘోషణం మరో యిద్దరూ ఎప్పుడూ నీతో మాట్లాడాలని తహతహలాడతారని, నీతో మాట్లాడితే విజ్ఞానం పెరుగుతుందనీ-ఆలోచనలు ఎదుగుతాయని అందారని గర్వంగా చెప్పావు. మధ్యలో శేఖర్ని ఎత్తిపొడిచావు ఆడదాన్ని అర్థం చేసుకోవాలంటే విశాల హృదయం వుండాలీ పెళ్ళి చేసుకుంటే చాలదూ అని ఆ వెంటనే శేఖర్ లేచి వెళ్ళిపోయాడని. నేనేదో సర్దిచెబితే నీకు కోపం కూడా వచ్చింది. ఔనా? బాధపడకు. చెప్పేది విను. సాధారణంగా బయట మగవాళ్ళు తోటి ఉద్యోగినితో మాట్లాడేటప్పుడు వాళ్ళ హ్యాపీనెస్ కోసం సరదాగా, కాలక్షేపంగా మాట్లాడతారేగానీ అదంతా ఆరాధన కాదు. గౌరవం అంతకంటే కాదు. అలా గౌరవభావంతో చూసే మగవాళ్ళు లేరని కాదు. కానీ చాలా తక్కువ."

"ఏదైనా సరే. పురుషుడు అహంకారంతో స్త్రీని అణగద్రొక్కే ప్రయత్నం చేస్తూనే వుంటాడు. ఇన్నాళ్ళూ యింట్లోనే అనుకున్నాను. కానీ ఆఫీసులోనూ అంతే అని యిప్పుడర్థం అయింది" అంది శైలజ.

"అందరి స్త్రీల పరిస్థితులూ ఒక్కలా వుండవు. అందరు మగాళ్ళూ భార్యను వేధించే వాళ్ళే వుండరు" అంది పావని.

"కానీ స్త్రీ స్వేచ్ఛను మాత్రం హర్షించరు. ఆమె పురోగతిని చూసి ఆనందించలేరు"

"అలా అని ఎవరన్నారు? ఓ అభిమానం, ఓ జాగ్రత్త, మందలింపూ-నీకు అనూయలా, సంకుచితంగా ఎందుకు అనిపిస్తున్నాయి?" పావని శైలజ బుర్రను క్లీన్ చెయ్యాలని నిర్ణయించుకుంది.

"కాదా మరి పురుషుడు తన భార్య ఎవరితోనైనా సరదాగా మాట్లాడితే వూరుకుంటాడా?"

"కొందరు అనుమానపు మొగుళ్ళు తప్పితే మిగతావాళ్ళంతా భార్యని గౌరవంగా చూస్తారు. చూడాలనుకొంటారు. అందుకే అలా మందలిస్తారు. శైలూ! శేఖర్ ఎవరైనా అమ్మాయితో సరదాగా కబుర్లు చెప్పుకుంటూంటే నీకెలా వుంటుంది?"

శైలజ మొహం దించుకొంది. శేఖర్ క్లాస్‌మేట్ ఓ అమ్మాయి సెక్రటేరియట్‌లో పనిచేస్తోంది. ఓరోజు బజారులో తటస్థపడితే శేఖర్ పరిచయం చేసాడు. ఆ తరువాతెప్పుడో పెళ్ళి శుభలేఖ యిచ్చేందుకు వచ్చింది. తనతో కాఫీ పెడుతూంటే శేఖర్, ఆ అమ్మాయి కాలేజీ కబుర్లు జ్ఞాపకం చేసుకుని నవ్వుతున్నారు. ఆరోజు పావని కూడా ఉందక్కడ. ఆ అమ్మాయి వెళ్ళాక తను శేఖర్‌తో సరిగ్గా మాట్లాడలేదు. పరోక్షంగా విమర్శించింది.

"శైలూ! పొసెసివ్‌నెస్ నీకులా నీ భర్తకు వుండకూడదా? దానికంటే ముందు మగవాడు పరాయి ఆడదాన్ని ఎలా ట్రీట్ చేస్తాడో తెలుసుగనకే ఎక్కువగా తన భార్య యితర పురుషులతో ఫ్రీగా మాట్లాడి, మనలి గౌరవం పోగొట్టుకోకూడదు అనుకుంటాడు. అది ఓ పాజిటివ్ సజెషన్‌గా తీసుకుంటే ఏ గొడవలూ వుండవు" అంది పావని.

"అయినా కేవలం భర్తా, పిల్లలూ మాత్రమే జీవితం అంటే ఒప్పుకోను" అంది శైలజ.

"జీవితం అంతా వాళ్ళే కాదే కానీ వాళ్ళ జీవితాల్లోనూ నీవూ వున్నావు. అది గుర్తుంచుకో. వాళ్ళపట్ల నీకూ, నీ పట్ల వాళ్ళకీ బాధ్యతా, ప్రేమా వుండాలి. జీవితమంతా వాళ్ళు కాకపోయినా, జీవితంలో వాళ్ళకి నీవూ నీకు వాళ్ళూ ముఖ్యం. అలాగే మిగతావి వుండాలి. కానీ పర్సంటేజ్ తేడా. అనవసరపుఆలోచనలతో జీవితాన్ని పాడు చేసుకోకు. ఇజాలు అన్న వైరస్ కుటుంబ జీవితానికి సోకితే ఆ కుటుంబంలో భార్యాభర్తలిద్దరికీ శాంతి వుండదు. పద భోంచేద్దాం" అంది పావని. మెల్లిగా తేరుకున్న శైలజ లేచి హేండ్‌బాగ్ అందుకుంది.

"వద్దు, ఇంటికెళతాను. ప్రొద్దున కోపంగా అన్నం మాత్రం వండి వచ్చాను" బేలగా అంది శైలజ.

"కనీసం మరో కప్పు కాఫీనో-మజ్జిగో తాగి వెళ్ళు-రెండవుతోంది" అంటూ మళ్ళీ కాఫీ కలిపి శైలజకిచ్చి, రెండు బత్తాయిలు చేతిలో పెట్టి బొట్టు పెట్టింది పావని.

కాఫీ తాగి 'వస్తా'నంటూ వెళుతున్న శైలజలో మార్పును గమనించింది పావని.

యింటికెళ్ళేవరకూ శైలజ శేఖర్‌తో తన ప్రవర్తన పట్ల మధనపడుతూనే వుంది.

తాళం వేయని తలుపులు శేఖర్ యింట్లో వున్నాడని చెప్పాయి. శైలజకి తన్ను తాను శిక్షించుకోవాలనిపించింది. బెల్ విని తలుపు తీసిన శేఖర్ శైలజని చూసి తెల్లబోయి తేరుకున్నాడు.

పాప సోఫాలో పడుకునుంది. బహుశా శేఖర్ ప్రక్కనే కూచుని వుంటాడు. శేఖర్ ఎప్పుడూ అంతే. అది తుమ్మినా, దగ్గినా పక్కనే కూర్చుని జాగారం చేస్తాడు. అది నీరసంగా, జాలిగా చూస్తోంది. శైలజకి ఆ చూపులు 'నామీద నీకు జాలుందా?' అని ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించాయి.

"నీవెళ్ళాక మళ్ళీ రెండుసార్లు విరోచనాలయాయి. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాను. బలహీనంగా వుందని ఓ బాటిల్ గ్లూకోజ్ ఎక్కించారు. మందులు రాసారు. వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల అలా తరచూ జ్వరమూ, విరోచనాలూ అవుతున్నాయట" తను యింట్లో వున్న కారణం చెప్పాడు శేఖర్. శైలజకి కన్నీళ్ళు ఆగలేదు. పాపని ఒళ్ళోకి లాక్కుని సోఫాలో కూలబడింది.

"అబ్బే..భయం లేదు. తగ్గుతుంది. వైరస్ ఫీవర్ అంతే. మనం జాగ్రత్తగా వుంటే అంతా సరిగ్గా వుంటుంది. తగ్గుతుంది. ఏడవకు. అలా బెంబేలు పడితే ఎలా? వుండు కాస్త కాఫీ తెస్తా" అంటూ లోపలికెళ్ళబోతున్న శేఖర్ చేతిని అందుకుని ఆపింది శైలజ. పాప నుదిటిపై ముద్దుపెట్టుకుని, పాపని పడుకోబెట్టి వంటింట్లోకి వెళుతున్న శైలజని అబ్బురంగా, తృప్తిగా చూసాడు శేఖర్.

దానిక్కాదు. నాకు సోకిన వైరస్ పోయింది అనుకుంది శైలజ యిద్దరికీ కాఫీ కలుపుతూ.

★